# నవతరం
నేటితరం కోసం...

హైదరాబాద్ | బుధవారం, డిసెంబరు 24, 2025 | సంపుటి:11 | సంచిక : 245 | పేజీలు: 4 | వెల : రూ.5




చైనా, పాకిస్థాన్‌తో వివాదాలు.. యుద్ధాలకు సిద్ధంగా ఉండాలని సీడీఎస్ అనిల్‌చౌహాన్ వ్యాఖ్య

# శాఖల మధ్య, అధికారుల మధ్య సమన్వయం ఉండాలి



హైదరాబాద్, నవతరం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను సాధించడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్దిష్టమైన భవిష్యత్తు ప్రణాళికతో తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాల వారిగా సమగ్రమైన అభివృద్ధికి అన్ని విభాగాలు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. విజన్ డాక్యుమెంట్ కేవలం ప్రచారానికి పరిమితమనే అపోహను తిప్పికొట్టేలా, ప్రతి అంశంపై లక్ష్యాలను చేరుకోవడానికి ఉన్నతాధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అన్ని విభాగాలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేస్తే 2047 లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఉన్నతాధికారులు, సీఎంఓ అధికారులతో ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమై దాదాపు మూడు గంటలకుపైగా సమీక్షించారు. రానున్న రోజుల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. "ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. మరికొన్ని అంశాల్లో భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకున్నాం. గతంలో విద్యుత్, విద్య, నీటిపారుదల, ఆరోగ్య లాంటి పలు శాఖలకు సంబంధించిన ఒక పాలసీ లేని కారణంగా కొన్ని సమస్యలొచ్చాయి. అందుకే ముఖ్యమైన విభాగాలకు ప్రత్యేకంగా పాలసీ తీసుకొచ్చాం. అలాగే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి స్పష్టమైన పాలసీ ఉండాలన్న ఉద్దేశంతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు, విధివిధానాలతో ముందుకు వెళుతున్నాం. లక్ష్యాలను సాధించడంలో అదికారులు నిర్లక్ష్యం వహించరాదు. పనితీరులో మార్పు రావాలి. ఇకపై కార్యదర్శులు ప్రతి నెలా ప్రధాన కార్యదర్శికి నివేదికలు సమర్పించాలి. అందరి పనితీరుపై సమీక్ష నిర్వహిస్తా. ఐఏఎస్ అధికారులు ప్రతి పది రోజులకోసారి క్షేత్రస్థాయికి వెళ్లాలి. నెలలో కనీసం మూడు సార్లు తమ శాఖ పరిధికి సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలి. శాఖల మధ్య, అధికారుల మధ్య సమన్వయం కోసం ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. తెలంగాణ రైజింగ్ లక్ష్యాల సాధన దిశగా అన్ని విభాగాలు నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. రాష్ట్రంలో ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన దాదాపు 10 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఉద్యోగులకు సంబంధించిన పూర్తి వివరాలు జనవరి 26 లోగా ప్రధాన కార్యదర్శికి అందించాలి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు క్రమం తప్పకుండా అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్ అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల అధికారులు పరిశీలించాలి. ఉద్యోగాల డేటా విషయంలో అధికారులదే పూర్తి బాధ్యత. రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగకూడదు. జనవరి 26 లోపు అద్దె భవనాల్లో ఉన్న కార్యాలయాలను ఖాళీ చేసి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మారాలి. ఖాళీ భవనాలు అందుబాటులో లేకపోతే ఖాళీ స్థలాలను గుర్తించి నిర్ణీత గడువులోగా సొంత భవనాల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలి. ప్రజలకు సేవలు అందించే కార్యాలయాలు పట్టణాల్లో అందరికీ అందుబాటులో ఉండేలా కొత్త భవనాలు నిర్మించాలి. ఇతర విభాగాలు, శాఖలకు చెందిన భవనాలుంటే వాటిని వినియోగించుకోవాలి. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ హాస్టళ్లు, అంగన్వాడీలు అన్నింటికీ సొంత భవనాలు ఉండేలా వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలి. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) నుంచి వచ్చే నిధులను అన్ని శాఖలు సద్వినియోగం చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, వివిధ విభాగాలకు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి అన్నారు ముఖ్యమంత్రి. జనవరి 31 లోగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఈ -ఫైలింగ్ విధానం అమలు చేయాలి. కాగితాలు, ఫైళ్లు పట్టుకొని తిరిగే పరిస్థితి ఉండకూడదు. ఆయా శాఖల పరిధిలోని కార్యక్రమాల అమలుకు ప్రత్యేకంగా డాష్ బోర్డు సిద్ధం చేసి దాన్ని సీఎస్, సీఎంఓ డాష్ బోర్డుతో అనుసంధానం చేయాలి. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు ఎంతమేరకు గ్రౌండయ్యాయి. వాటి పురోగతిని ప్రతి నెలా సమీక్షించుకోవాలి. పరిశ్రమలకు అవసరమైన భూసేకరణ, భూ కేటాయింపులకు అవసరమైన మేరకు ప్రత్యేకంగా అధికారులను నియమించాలి. కోర్ అర్బన్ ఏరియాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. కార్పొరేట్ తరహాలో సర్కారు స్కూళ్లలో నమోదు శాతం పెంచేందుకు రవాణా సదుపాయం, బ్రేక్ ఫాస్ట్, మిడ్ డే మీల్స్ అమలు దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కాలేజీలన్నింటిలోనూ టీచింగ్ హాస్పిటల్స్, అద్భుతమైన వైద్య సేవలు అందించేలా తీర్చిదిద్దాలి. నిమ్స్ తరహాలో సనత్‌నగర్, కొత్తపేట, అల్వాల్ టిమ్స్, వరంగల్ హాస్పిటల్స్, ఉస్మానియా కొత్త ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా ఉండాలి." అని ముఖ్యమంత్రి ఆదేశించారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సమన్లపై సిట్ ఆలోచన

హరీశ్‌రావు పాత్రపై కూడా విచారణకు సిద్ధమవుతున్న దర్యాప్తు బృందం

'అంతిమ లబ్ధిదారులు ఎవరు?' అన్న కోణంలో విచారణ వేగం

ప్రభాకర్‌రావు పునర్నియామకమే కేసుకు కీలక ఆధారంగా మారే అవకాశం

శాసనసభ సమావేశాల తర్వాత నోటీసుల జారీపై చర్చ

హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు కీలక దశకు చేరింది. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసే అంశాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కేసుకు తార్కిక ముగింపు ఇవ్వాలంటే రాజకీయ స్థాయిలోని కీలక నిర్ణయాలపై స్పష్టత అవసరమని సిట్ భావిస్తున్న నేపథ్యంలో, మాజీ మంత్రి హరీశ్‌రావును కూడా విచారించే దిశగా ఆలోచన జరుగుతున్నట్లు తెలుస్తోంది. శాసనసభ సమావేశాల అనంతరం వీరిద్దరికీ సమన్లు జారీ చేసే అవకాశముందని సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు విచారణలో కీలక ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకుంటున్నారని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ చర్యలు తన వ్యక్తిగత నిర్ణయం కాదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే జరిగాయని ఆయన చెబుతుండగా, ఆయా ఉన్నతాధికారులు మాత్రం అటువంటి ఆదేశాలు ఇవ్వలేదని ఇప్పటికే వాంగ్మూలాలు ఇచ్చారు. దీంతో బాధ్యత ఎవరిది అన్న అంశంపై దర్యాప్తు మరింత లోతుగా సాగుతోంది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన సమీక్ష కమిటీ సభ్యుల వాంగ్మూలాలు కూడా దర్యాప్తులో కీలకంగా మారాయి. ప్రతి సమీక్ష సమావేశానికి ప్రభాకర్‌రావు వేల సంఖ్యలో ఫోన్ నంబర్ల జాబితాలను తీసుకొచ్చేవారని, అవి నిజంగా

(మిగతా 2వ పేజీలో)



## సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త ఏఎస్‌జీలు

దవీందర్ పాల్ సింగ్, అనిల్ కౌశిక్, రవీంద్ర కనకమేడలలకు బాధ్యతలు

## అరెస్టు బెదిరింపులు నన్ను ఆపలేవు ::: హరీశ్‌రావు

ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో రాజకీయ కక్ష సాధింపు జరుగుతోందని ఆరోపణ

నోటీసులు, అరెస్టులు వస్తే మరింత ఉత్సాహంగా పనిచేస్తానని స్పష్టం



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో తమపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుకు పాల్పడుతోందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే తనకు నోటీసులు ఇస్తారనే ప్రచారం సాగుతోందని

(మిగతా 2వ పేజీలో)



## డిసెంబర్ 31న మద్యం దుకాణాలకు అర్ధరాత్రి 12 గంటల వరకు అనుమతి

బార్లు, క్లబ్బులు, ఈవెంట్‌లకు అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతి

జీవో విడుదల చేసిన తెలంగాణ ఎక్సైజ్ శాఖ



## హెచ్-1బీ వీసాలపై ట్రంప్ సంచలన నిర్ణయం

లాటరీ విధానానికి స్వస్తి.. జీతం, నైపుణ్యాల ఆధారంగా ఎంపిక

2027 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త నిబంధనల అమలు

భారతీయ నిపుణులపై ప్రభావం చూపే అవకాశం

## సభకు దూరంగా ఉంటే ప్రతిపక్ష బాధ్యత ఎలా నిర్వర్తిస్తారు?

రెండేళ్లు అసెంబ్లీకి రాని కేసీఆర్‌పై డిప్యూటీ సీఎం భట్టి తీవ్ర విమర్శలు

ఫాంహౌస్ నుంచి వచ్చి దిగజారుడు ఆరోపణలు సరికావని వ్యాఖ్య

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ బలం.. ఎన్నికల ఫలితాలే నిదర్శనం

పెట్టుబడులు, అభివృద్ధి చూసి భయంతోనే విమర్శలు: భట్టి ఆరోపణ



సత్తుపల్లి/తల్లాడ: రెండేళ్లుగా అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు నిర్వర్తించకుండా ప్రజలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కేసీఆర్ ఇప్పుడు బయటకు వచ్చి అసత్య ఆరోపణలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా మండిపడ్డారు. దిగజారుడు భాషతో ప్రభుత్వంపై

(మిగతా 2వ పేజీలో)



## నల్లగొండ నుంచే నదీ జలాల అన్యాయంపై పోరు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ అడ్డుకుంటోంది: కేటీఆర్

కేసీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము ప్రభుత్వానికి లేదు

ధైర్యముంటే పరిషత్, సహకార ఎన్నికలు నిర్వహించాలి

నల్లగొండ : రాష్ట్రానికి నదీ జలాల విషయంలో జరుగుతున్న అన్యాయంపై నల్లగొండ నుంచే పోరాటాన్ని ప్రారంభిస్తామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రకటించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే అడ్డుకుంటోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. డీపీఆర్‌ను కేంద్రం తిరిగి పంపిన అంశంపైనా సీఎం రేవంత్‌రెడ్డి మౌనం పాటించడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. మంగళవారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ తరఫున

(మిగతా 2వ పేజీలో)

# సమస్యల పరిష్కారంలో సర్కారు వైఫల్యం

**రెండేళ్ళలో ప్రభుత్వం చేసింది శూన్యం .. పాలకుల ప్రకటనలే తప్ప పరిష్కారం లేదు**

**జర్నలిస్టులకు అన్యాయం చేసే జీవోలెందుకు?.. అక్రెడిటేషన్ల జీవో తప్పుల తడక .. జీవోను వెంటనే సవరించాలి**

**కొత్త అక్రెడిటేషన్ కమిటీలు ఏర్పాటు చేయాలి .. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య**

సూర్యాపేట, డిసెంబర్ 23 (నవతరం): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన రెండేళ్లలో జర్నలిస్టులకు చేసిన మేలు శూన్యమని అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, రెండేళ్ల తర్వాత ప్రభుత్వం ఆగమేఘాల మీద జారీ చేసిన అక్రెడిటేషన్ల జీవో తప్పుల తడకగా ఉందని అన్నారు. అక్రెడిటేషన్ రూల్స్ 2025'ను ఖరారు చేస్తూ జారీ చేసిన జీవో 252 జర్నలిస్టులకు అన్యాయం చేసేదిగా ఉందని,జర్నలిస్టులకు అన్యాయం చేసే ఇలాంటి జీవోలెందుకని ప్రశ్నించారు. ఈ జీవోను వెంటనే సమీక్షించి సవరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జీవో ద్వారా కేవలం కొద్ది మంది జర్నలిస్టులకే మేలు జరుగుతుందని, మెజారిటీ జర్నలిస్టులకు, ముఖ్యంగా చిన్న పత్రికల జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవో ద్వారా ప్రభుత్వం చిన్న పత్రికలను చిదిమేస్తూ మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు చేసిందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 239కు ఈ జీవోకు పెద్ద తేడా ఏమీ లేదని అన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా కమిటీల పేరుతో కాలయాపన చేసి చివరికి చిన్న, మధ్య తరహా పత్రికల నోట్లో మట్టి కొట్టే విధంగా రూల్స్ తయారు చేశారని దుయ్యబట్టారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని, లేదంటే పూర్తిగా సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడిచినా జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వలేక పోయిందని విమర్శించారు. విభిన్న ప్రకటనలతో రెండేళ్లుగా జర్నలిస్టులను అయోమయానికి గురిచేశారని, కమిటీల పేరుతో సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేశారని అన్నారు. జర్నలిస్టులను మభ్యపెట్టేందుకు తప్పుడు ప్రకటనలు చేయడం సరైంది కాదని, ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక భారం లేని సమస్యలను కూడా పరిష్కరించకపోవడం శోచనీయమని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే హామీ నుంచి తప్పించుకుంటున్నదని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయడం తగదని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో



రాష్ట్రవ్యాపితంగా ఆందోళన చేపడతామని ఆయనహెచ్చరించారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ,పక్క రాష్ట్రాల్లో అమలవుతున్న జర్నలిస్టుల పెన్షన్ స్కీం, మన రాష్ట్రంలో అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో చిన్న మధ్య తరహా పత్రికలు మరింత చితికిపోతున్నాయని, అడ్వర్టయిజ్మెంట్లు లేక, రావాల్సిన బిల్లులు రాక పత్రికలు మనుగడ సాగించలేకపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల ఒకటో తేదీన రాష్ట్ర సమాచార పౌరసంబధాల శాఖ కమీషనర్ కార్యాలయం ఎదుట తాము ధర్నా చేయడం వల్ల ఆగమేఘాల మీద అక్రెడిటేషన్ల జీవో జారీ చేసిందని, మిగతా సమస్యలపై ప్రభుత్వంలో చలనం లేదని అన్నారు. ఫెడరేషన్ జిల్లా మాజీ కార్యదర్శి పాల్వాయి జానయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అడ్ హక్ కమిటీ ఏర్పాటుతెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన(టీడబ్ల్యూజేఎఫ్) సూర్యాపేట జిల్లా అడ్ హక్ కమిటీ ఏర్పడింది. కమిటీ అధ్యక్షుడిగా పాల్వాయి జానయ్య , కో-కన్వీనర్లుగా ముషం హరి, లింగాల సాయి, శ్రీరాముల కృష్ణ, దోరేపల్లి శ్రీనివాస్, తాందారుపల్లి శ్రీనివాస్, నందిపాటి సైదులు, గూడపూరి ప్రభాకర్ (ప్రభు), ఒగ్గు సోమన్న, కొంగల సతీష్, షేక్ నజీర్, వంగాల వెంకన్న తదితరులు నియమితులయ్యారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సభ్యత్వ నమోదు, జిల్లా మహాసభలు జరుగుతాయని ఫెడరేషన వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రకటించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సమన్లపై సిట్ ఆలోచన

మావోయిస్టుల కదలికలపై నిఘా ఉంచేందుకు సంబంధించినవేనా అని నిర్ధారించుకునే సాంకేతిక వసతులు తమ వద్ద లేవని వారు తెలిపారు. ఎస్ఐబీ ప్రతిష్ఠను నమ్మి ప్రభాకర్‌రావు చెప్పిన వివరాలనే ఆధారంగా తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే మావోయిస్టులతో సంబంధం లేని న్యాయమూర్తులు, జర్నలిస్టులు, రాజకీయ నాయకుల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చిందన్న ప్రశ్నకు ఇప్పటివరకు సరైన సమాధానాలు రాకపోవడాన్ని సిట్ గమనిస్తోంది. ఈ నేపథ్యంలో అక్రమ నిఘా వెనక ఉన్న అసలు అవసరం ఎవరిది అన్నదే ఇప్పుడు దర్యాప్తు కేంద్రబిందువుగా మారింది. ప్రభాకర్‌రావు ఎందుకు ఈ స్థాయిలో రాజకీయ నిఘా పెట్టాల్సి వచ్చిందన్న అంశాన్ని తేల్చగలిగితే, ఈ వ్యవహారంలో లబ్ధి పొందిన వారు ఎవరో స్పష్టమవుతుందని సిట్ భావిస్తోంది. అదే క్రమంలో ఆయన ఉద్యోగ విరమణ అనంతరం కూడా కీలక బాధ్యతల్లో కొనసాగించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ప్రభాకర్‌రావును ఎస్ఐబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా కొనసాగించడం, అంతేకాకుండా ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఇంటెలిజెన్స్ విభాగానికి ఓఎస్డీగా నియమించడంపై సిట్ లోతుగా ఆరా తీస్తోంది. ఈ పునర్నియామక ప్రక్రియ వెనకున్న ఉద్దేశమే కేసుకు కీలక మలుపు కావచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ అంశానికి సంబంధించి అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్‌కుమార్, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, అలాగే కేసీఆర్‌కు అప్పట్లో ఓఎస్డీగా పనిచేసిన రాజశేఖర్‌రెడ్డి నుంచి ఇప్పటికే వాంగ్మూలాలు నమోదు చేశారు. మరోవైపు ప్రభాకర్‌రావు పునర్నియామకానికి సంబంధించిన నోట్‌ఫైల్స్‌లో కీలక ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. అవసరమైతే రాజశేఖర్‌రెడ్డిని మరోసారి విచారించే అవకాశాన్ని కూడా సిట్ పరిశీలిస్తోంది. ఇదిలా ఉండగా, ఈ కేసులో రెండో నిందితుడు ప్రణీత్‌రావు, ఆరో నిందితుడు శ్రవణ్‌రావు మధ్య సమావేశానికి హరీశ్‌రావు మధ్యవర్తిత్వం వహించినట్లు దర్యాప్తులో వెల్లడైన సమాచారం కూడా సిట్‌ను మరింత అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో హరీశ్‌రావును విచారించాల్సిన అవసరం ఉందని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాలన్నింటితో ఫోన్ ట్యాపింగ్ కేసు రాజకీయంగా మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

## నల్లగొండ నుంచే నదీ జలాల అన్యాయంపై పోరు

గెలిచిన సర్పంచులు, ఉపసర్పంచుల సన్మాన సభలో కేటీఆర్ మాట్లాడారు. సాగునీటి మంత్రికి నదీ జలాలపై కనీస అవగాహన కూడా లేదని, కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కేసుల రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాలమూరు%-%రంగారెడ్డి ప్రాజెక్టులో 90 శాతం పనులు పూర్తయ్యాయని కేటీఆర్ గుర్తు చేశారు. మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఆరు గ్యారంటీలు, వందల హామీల భయంతో ప్రభుత్వం గందరగోళంలో పడిందని ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడినా గులాబీ సైన్యం ఎదురొడ్డి పోరాడి 45 శాతం స్థానాలను గెలుచుకుందని తెలిపారు. ఓటమి భయంతోనే సహకార సంఘాలు, పరిషత్ ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పదవులతో సరిపెట్టుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రైతుబంధు రూ.15 వేలు, పెన్షన్లు రూ.4 వేలు, మహిళలకు రూ.2,500, విద్యార్థులకు స్కూటీలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు కోరితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. కేసులు, బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడేదే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రశ్నలు ఎదురైతే లీకుల పేరుతో కేసులు పెట్టిస్తూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందన్నారు. 2014లో రాష్ట్ర అప్పు రూ.80 వేల కోట్లు మాత్రమేనని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పుల వివరాలను పార్లమెంట్‌లోనే కేంద్ర మంత్రి వెల్లడించారని కేటీఆర్ చెప్పారు. అయినా సీఎం రేవంత్‌రెడ్డి రూ.8 లక్షల కోట్లు, డిప్యూటీ సీఎం రూ.7 లక్షల కోట్లు అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధుకు రూ.73 వేల కోట్లు, కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, మెడికల్ కాలేజీలు, గురుకులాలు, కేసీఆర్ కిట్లు వంటి పథకాలు అమలు చేశామని తెలిపారు. రెండేళ్లలో భారీగా అప్పులు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ఏమి చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. సీఎంకు నిజాయితీ ఉంటే వెంటనే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గ్రామానికి సర్పంచ్ సీఎం స్థాయిలోనే ముఖ్యమని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో గులాబీ సైన్యం ఐక్యంగా పనిచేసి మరోసారి విజయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.

# హెచ్-1బీ వీసాలపై ట్రంప్ సంచలన నిర్ణయం

**లాటరీ విధానానికి స్వస్తి..**
**జీతం, నైపుణ్యాల ఆధారంగా ఎంపిక**

**2027 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త నిబంధనల అమలు**

**భారతీయ నిపుణులపై ప్రభావం చూపే అవకాశం**

వాషింగ్టన్: అమెరికాలో ఉద్యోగాలు ఆశిస్తున్న విదేశీ నిపుణులకు కీలకమైన హెచ్-1బీ వీసా విధానంలో ట్రంప్ ప్రభుత్వం సంచలన మార్పులు ప్రకటించింది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న లాటరీ పద్ధతిని రద్దు చేస్తూ, ఇకపై అధిక జీతాలు, ఉన్నత నైపుణ్యాల ఆధారంగా వీసాల కేటాయింపులు చేయనున్నట్లు వెల్లడించింది. అమెరికన్ ఉద్యోగుల వేతనాలు, ఉపాధి అవకాశాలను కాపాడడమే ఈ సంస్కరణల లక్ష్యమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ స్పష్టం చేసింది. ప్రస్తుత లాటరీ విధానాన్ని కొన్ని కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, అమెరికన్లతో పోలిస్తే తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకునేందుకు దీన్ని ఉపయోగిస్తున్నారని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ అధికార ప్రతినిధి మాథ్యూ ట్రాగెసర్ విమర్శించారు. హెచ్-1బీ కార్యక్రమం అసలు ఉద్దేశం అధిక నైపుణ్యాలు కలిగిన నిపుణులను ఆకర్షించడమేనని, కొత్త విధానం ఆ లక్ష్యాన్ని నెరవేరుస్తుందని ఆయన పేర్కొన్నారు.

**జీతం, నైపుణ్యాలే ప్రాతిపదిక**

కొత్త విధానం ప్రకారం హెచ్-1బీ దరఖాస్తులను ఇకపై యాదృచ్ఛికంగా ఎంపిక చేయరు. దరఖాస్తులను జీతం, నైపుణ్యాల స్థాయిని బట్టి ర్యాంకులుగా విభజించి, ఎక్కువ ర్యాంకు పొందినవారికి వీసాలు కేటాయిస్తారు. తక్కువ జీతాలతో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని పూర్తిగా తొలగించకపోయినా, అధిక నైపుణ్యాలు ఉన్నవారికి స్పష్టమైన ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఏటా జారీ చేసే వీసాల సంఖ్యలో మాత్రం మార్పు లేదని, సాధారణ కోటాలో 65,000 వీసాలు, అమెరికాలో ఉన్నత విద్య పూర్తి చేసిన వారికి అదనంగా 20,000 వీసాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కొత్త నిబంధనలు ఫిబ్రవరి 27 నుంచి అమల్లోకి రానుండగా, 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన హెచ్-1బీ రిజిస్ట్రేషన్లకు వర్తింపజేయనున్నారు. వీసా వ్యవస్థను సమూలంగా సంస్కరించాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాల్లో ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇటీవల వీసా అర్హత కోసం యజమానులు అదనంగా లక్ష డాలర్లు చెల్లించాలనే నిబంధనను కూడా తీసుకురావడం గమనార్హం.

## చైనా, పాకిస్థాన్‌తో వివాదాలు..
## యుద్ధాలకు సిద్ధంగా ఉండాలని సీడీఎస్ అనిల్‌చౌహాన్ వ్యాఖ్య

స్వల్పకాలిక, దీర్ఘకాలిక యుద్ధాలకు భారత్ సంసిద్ధంగా ఉండాలని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అణు సామర్థ్యం కలిగిన చైనా, పాకిస్థాన్ నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐఐటీ బాంబేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయని గుర్తు చేశారు. భారత్‌కు ఇద్దరు ప్రత్యర్థులు ఉన్నారని, ఆ రెండు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు. ఆ దేశాల నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు మనం సిద్ధంగా ఉండాలని అన్నారు. గతంలో నిర్వహించిన ఆపరేషన్ల మాదిరిగానే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి స్వల్ప, దీర్ఘకాలిక ఘర్షణలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే కొనసాగుతున్న సరిహద్దు వివాదాల కారణంగా భూతల ఘర్షణల్లో పోరాడేందుకు సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అయితే వీటిని నివారించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్, ఎడ్జ్ కంప్యూటింగ్ యుద్ధ తీరును మారుస్తున్నాయని అన్నారు.



## సభకు దూరంగా ఉంటే ప్రతిపక్ష బాధ్యత ఎలా నిర్వర్తిస్తారు?

విమర్శలు చేయడం ప్రజాస్వామ్యానికి తగదని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలో రూ.10.53 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేసిన అనంతరం, సత్తుపల్లిలో సింగరేణి ఏరియా జీఎం కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందువల్లే పంచాయతీ ఎన్నికల్లో 85 శాతం మంది సర్పంచ్‌లుగా కాంగ్రెస్ మద్దతుదారులే గెలిచారని ఆయన పేర్కొన్నారు. తమకు దిగజారి మాట్లాడే రాజకీయాలు అలవాటు లేవని, ప్రజా సంక్షేమం ద్వారానే బీఆర్ఎస్ నేతలకు సమాధానం చెబుతామని భట్టి వ్యాఖ్యానించారు. 'రెండేళ్లు ఫాంహౌస్‌లో ఉండి, ఇప్పుడు మీడియా ముందుకొచ్చి తోలు తీస్తాం అని మాట్లాడటం సరికాదు. తోలు వలుస్తామంటే ఇక్కడ ఎవరూ ఖాళీగా లేరు. అలాంటి మాటలు చెప్పే అధికారం ఆయనకు ఎప్పుడు ఎవరు ఇచ్చారు?' అంటూ భట్టి వ్యంగ్యంగా ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి రావడానికే భయపడుతున్నారని, అలాంటప్పుడు ఆ హోదా అవసరమా అనే విషయాన్ని కేసీఆర్ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తుండటంతో తమ రాజకీయ భవిష్యత్తు కనుమరుగవుతుందనే భయంతోనే కేసీఆర్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని భట్టి ఆరోపించారు. మీడియా ముందు మాట్లాడి మళ్లీ ఫాంహౌస్‌కే వెళ్లిపోవడం ద్వారా ప్రజల పట్ల ఉన్న బాధ్యతను కేసీఆర్ విస్మరిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి భవిష్యత్తు ప్రణాళికలపై భట్టి మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తిలో ప్రైవేట్ సంస్థలతో పోటీ పడుతూనే సింగరేణిని బహుముఖంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కాపర్, గోల్డ్ మైనింగ్ రంగాల్లోనూ సింగరేణి అడుగుపెట్టిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బావులకు వేలం నిర్వహించినా, తెలంగాణలో ఒక్క బావి కూడా ఇతరులకు వెళ్లకుండా కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించిందని భట్టి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో సింగరేణి సీఎండీ కృష్ణభాస్కర్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టు బెదిరింపులు నన్ను ఆపలేవు : హరీశ్

పేర్కొంటూ, అలాంటి బెదిరింపులకు తాను భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణభవన్‌లో మంగళవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ, అరెస్టు చేస్తే మరింత ఉత్సాహంతో ప్రజల తరఫున పోరాడతానని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు సాగిన ఉద్యమంలో త్యాగాల చరిత్ర తమదని హరీశ్‌రావు గుర్తు చేశారు. గతంలో ఉద్యమ సమయంలో తనపై 300కుపైగా కేసులు పెట్టినప్పటికీ వెనక్కి తగ్గలేదని, ఇప్పటి ప్రభుత్వ కుట్రలకూ భయపడబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇరుకున పడిన ప్రతిసారీ ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా%-%ఈ రేస్ వంటి కేసుల పేరుతో లీకులు ఇచ్చి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. తాజాగా ఏర్పాటు చేసిన సిట్ కూడా ఒక పెద్ద జోక్‌లా మారిందని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి మెప్పుకోసం అక్రమ కేసులు పెడుతున్న పోలీసు అధికారుల పేర్లను తాము నమోదు చేసుకుంటున్నామని హరీశ్‌రావు హెచ్చరించారు. గతంలో ఏపీలో అధికారులకు ఎదురైన పరిణామాలే ఇక్కడ కూడా ఎదురవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఇటీవల లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయిందని, ముఖ్యమంత్రి సహా మంత్రులు ఒక్క అంశంపైనా సరైన సమాధానం చెప్పలేకపోయారని విమర్శించారు. తన రాజకీయ జీవితంలో తొలిసారిగా ఒక ముఖ్యమంత్రి రాత్రి 9:30 గంటలకు చిట్‌చాట్ పెట్టి వివరణ ఇచ్చుకోవడం చూశానని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. అరడజను మంది మంత్రులు వరుసగా ప్రెస్‌మీట్లు పెట్టాల్సి వచ్చిందంటే అది కేసీఆర్ రాజకీయ ప్రభావమేనని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 4,000 మందికిపైగా భారాస మద్దతుదారులు సర్పంచులుగా గెలవడం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని ఆరోపించారు. అందుకే సహకార ఎన్నికలు నిర్వహించకుండా నామినేషన్ల ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలను నియమించాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సాగునీటి అంశాలపై ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే వాస్తవాలు వెల్లడించేందుకు భారాసకూ అదే అవకాశాన్ని కల్పించాలని కోరారు. తమకు ఇతర పార్టీలకంటే తక్కువ సమయం ఇచ్చి గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేసి రూ.30 వేల కోట్ల అప్పులు తెచ్చే యోచన ప్రభుత్వం చేస్తోందని ఆరోపించిన హరీశ్‌రావు, సాగునీటి ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతోందని తీవ్ర విమర్శలు చేశారు. కృష్ణా జలాల వినియోగంపై ప్రభుత్వం చెబుతున్న లెక్కలు వాస్తవాలకు దూరమని, 2023 డిసెంబరు నుంచి ఇప్పటివరకు వినియోగం కేవలం 28.49 శాతం మాత్రమేనని తెలిపారు. తెలంగాణకు 45 టీఎంసీలు చాలని కేంద్రానికి లేఖ రాయడం చారిత్రక తప్పిదమని పేర్కొంటూ, ఇది రాష్ట్ర జలహక్కులకు తీరని ద్రోహమని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

## సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త ఏఎస్‌జీలు

**దవీందర్ పాల్ సింగ్, అనిల్ కౌశిక్, రవీంద్ర కనకమేడలలకు బాధ్యతలు**

**మూడేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వ తరపున కీలక న్యాయ సేవలు**

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వ తరపున వాదనలు వినిపించేందుకు ముగ్గురు అడిషనల్ సొలిసిటర్ జనరల్‌లను (ఏఎస్‌జీలు) నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ న్యాయవాదులు దవీందర్ పాల్ సింగ్, అనిల్ కౌశిక్, రవీంద్ర కనకమేడలలను ఈ బాధ్యతలకు ఎంపిక చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. వీరు మూడేళ్లపాటు ఏఎస్‌జీలుగా కొనసాగనున్నారు. దవీందర్ పాల్ సింగ్ గతంలో పంజాబ్, హర్యాణా రాష్ట్రాలకు అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా పనిచేసిన అనుభవం కలిగి ఉన్నారు. అనిల్ కౌశిక్, కనకమేడల రవీంద్ర కుమార్ సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదులుగా పేరొందారు. అడిషనల్ సొలిసిటర్ జనరల్‌గా వీరు కేంద్ర ప్రభుత్వ తరపున సుప్రీంకోర్టు, హైకోర్టులలో సివిల్, క్రిమినల్ కేసులను వాదించనున్నారు. రాజ్యాంగ సంబంధిత అంశాలతో పాటు ఇతర కీలక న్యాయ విషయాల్లో కేంద్రానికి సలహాలు ఇవ్వనున్నారు. అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌కు సహాయకులుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ న్యాయ వ్యవస్థలో కీలక పాత్ర పోషించనున్నారు.

## డిసెంబర్ 31న మద్యం దుకాణాలకు అర్ధరాత్రి 12 గంటల వరకు అనుమతి

**బార్లు, క్లబ్బులు, ఈవెంట్‌లకు అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతి**

**జీవో విడుదల చేసిన తెలంగాణ ఎక్సైజ్ శాఖ**

డిసెంబర్ 31 కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్బులకు అర్ధరాత్రి వరకు అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 31న మద్యం దుకాణాలు అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్లు, క్లబ్బులు, ఈవెంట్ లకు అర్ధరాత్రి 1 గంట వరకు నిర్వహించేందుకు అనుమతి లభించింది. డిసెంబర్ 31న ప్రజలు, ముఖ్యంగా యువత అర్ధరాత్రి వరకు మేల్కొని ఉండి, జనవరి 1 రాగానే ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈ సందర్భంగా మద్యం ఎలా పొంగి ప్రవహిస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అన్ని రోజులు ఒకెత్తు, ఆ ఒక్క రోజు ఒకెత్తు అన్నట్టుగా మద్యం అమ్మకాలు సాగుతాయి.

# నాయిబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

### బిఆర్ఎస్ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్





కుత్బుల్లాపూర్, నవతరం: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్, కైసర్ నగర్ లోనీ ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్ అండ్ ట్రాన్స్ ఫార్మర్ ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై బోరు ప్రారంభించగా, సుమారు 5 లక్షల రూపాయల సొంత నిధులతో బోరును వేయించి నాయి బ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ... సంఘం శరణం గచ్ఛామి, ఐకమత్యమే మహాబలమని సంఘ సభ్యులందరూ ఐకమత్యంగా ఉండి సంఘ అభివృద్ధికి కృషి చేస్తే వేగవంతమైన అభివృద్ధి సాధ్యమని అన్నారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణపల్లో భాగంగా నూతనంగా బోరును, ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించడం జరిగిందని, రానున్న కాలంలో నాయి బ్రాహ్మణుల సేవా సంఘం భవన నిర్మాణాన్ని పూర్తిచేసి నాయి బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఓ మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గడిల వెంకటేశ్వర్లు నాయి, ప్రధాన కార్యదర్శి వివిఎస్ఆర్ వెంకటేష్ నాయి , మాజీ అధ్యక్షులు రేనయ్య నాయి, మాజీ ప్రధాన కార్యదర్శి పరమేష్ నాయి, మాజీ ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ మరియు సంఘ సభ్యులు, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, ఇబ్రహీం ఖాన్, మూసా ఖాన్, సుంకరి చందు, నాగేష్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, సాయిబాబ, నవీన్, శ్రీరాములు గౌడ్, చంద్ర శేఖర్ గౌడ్, ప్రసాద్, శివా నాయక్, జునైద్, గౌస్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# బట్టల పంపిణీ ఆనవాయితీగా వస్తుంది





కూకట్పల్లి, నవతరం: క్రిస్టియన్ ప్రజలకు ఎవరైనా ఎలాంటి ఆపద ఉన్న అండగా ఉంటానని పార్టీలకు అతీతంగా వారికి కావలసిన సేవలు అందించడంలో ముందుంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్పల్లి నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కూకట్పల్లి శేషాద్రి నగర్ కమ్యూనిటీ హాల్లో నియోజకవర్గంలోని క్రిస్టియన్ మహిళలు, పాస్టర్లతో కలిపి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్టియన్ మతస్థులకు బట్టలను పంపిణీ చేసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్రిస్మస్ వేడుకలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రిస్మస్ సందర్భంగా నియోజకవర్గంలోని క్రిస్టియన్ ప్రజలకు భోజనాలను పెట్టి బట్టల పంపిణీ చేయడం ఆనవాయితీగా చేస్తున్నాం. కెసిఆర్ ప్రభుత్వం హయాంలో కులాలకు మతాలకు అతీతంగా ప్రతి మతానికి వాళ్ళ ముఖ్యమైన పండుగలకు బట్టల పంపిణీ చేసేవాళ్లం అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ రెండు సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క పండక్కు కూడా బట్టలు పంపిణీ చేయలేదని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. పార్టీలకు అతీతంగా ఫాస్టర్లందరూ సెమీ క్రిస్మస్ వేడుకలకు వస్తుంటే కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎవరు ఎలాంటి ఇబ్బందులు పెట్టిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలోని కెపిహెచ్బి కాలనీలో హిందువులకు, ముస్లింలకు, క్రిస్టియన్లకు గ్రేవ్ యార్డులను ఏర్పాటు చేశామని భవిష్యత్తులో వారికి సేవలు అందించడంలో తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, రవీందర్ రెడ్డి సతీష్ గౌడ్, మహేశ్వరి శ్రీహరి , శిరీష బాబురావు, సబిహ గౌసుద్దీన్, తూము శ్రావణ్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మారుతి మోడరన్ రైస్ మిల్ ఓనర్‌పై ప్రభుత్వం చర్య తీసుకోవాలి

### బస్తాకు అదనంగా మూడు కిలోల ధాన్యం అడ్డగోలు దోపిడీ

### జలంత్రి పొత్తంగి రైతు సాలిన నరసింహ యాదవ్ ఆరోపణ








నవతరం :మందస : ఆరుగాలం శ్రమించే అన్నదాతల పండించే ధాన్యాన్ని కుంటి సాకులు చెబుతూ అక్రమంగా ఒక ధాన్యం బస్తాకు అదనంగా మూడు కేజీలు చొప్పున 83 కిలోల వరకు రైస్ మిల్లర్లు దోచుకుంటున్నారని సోంపేట మండలం జలంత్రి పొత్తంగి గ్రామానికి చెందిన రైతు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాలిన నరసింహ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మందస మండలం బాలిగాంలో ఉన్న మారుతి మోడరన్ రైస్ మిల్లు వద్ద మీడియాతో మాట్లాడుతూ, తాను సన్నకారు రైతునని, ఖరీఫ్ సీజన్ లో పండించిన ధాన్యాన్ని మందస మండలం బాలిగాం లో గల శ్రీ మారుతి మోడరన్ రైస్ మిల్ కి ధాన్యం అమ్మకానికి తరలించడం జరిగిందని, అయితే ప్రభుత్వ నిబంధన ప్రకారం ఒక ధాన్యం బస్తా 80 కేజీలు కొనుగోలు చేయవలసిన మిల్లు యజమాని గున్న బాబురావు తాను పండించిన ధాన్యాన్ని పరిశీలించి, అదనంగా ఒక ధాన్యం బస్తా కు అదనంగా మూడు కిలోలు చొప్పున ఇవ్వాలని, లేకపోతే ధాన్యం అన్లోడ్ చేసే ప్రసక్తి లేదని, అంతేకాక ఒక ధాన్యం బస్తా ట్రాక్టర్ నుంచి దింపడానికి 20 రూపాయలు చొప్పున చెల్లించాలంటూ, అదనంగా ట్రాక్టర్ బాడుగ తోపాటు డ్రైవర్ బేటా చెల్లించాలని డిమాండ్ చేశారని నరసింహ యాదవ్ ఆరోపించారు. తాను పండించే ధాన్యం ఎంతో నాణ్యత ప్రమాణం కలిగి ఉన్నప్పటికీ, తేమశాతం, నూకలు, తరుగు పేరుతో ఒక్కో బస్తాకు అదనంగా మూడు కిలోల చొప్పున ధాన్యం చెల్లించాలని. లేకపోతే.. ధాన్యాన్ని ఇంటికి పట్టుకు పో.. అంటూ మిల్లు యజమాని గున్న బాబురావు నిర్లక్ష్యంగా మాట్లాడిన తీరు బాగోలేదు అన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో చెప్పిన నిబంధనలకు, మిల్లర్లు పెట్టే కుంటి సాకులకు చాలా తేడా ఉందని, మిల్లర్లు చెప్పిందే వేదంగా మారుతుందన్నారు. మిల్లర్లు ఎంత మేరకు డిమాండ్ చేస్తే అంత ధాన్యం అదనంగా రైతు చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడిందని, ఒక విధంగా రైతుల నుంచి అడ్డగోలుగా ధాన్యాన్ని దోచుకుంటున్న దారి దోపిడీగాలుగా అభివర్ణించవచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. ఇష్టముంటే అమ్ము.. లేకుంటే పొమ్ము.. అన్న చందాన మిల్లర్ల అడ్డగోలు దోపిడీకి రైతులు బలైపోతున్నారని, తనకు జరిగిన అన్యాయం ఇతర రైతులకు కూడా అలాగే జరుగుతుందని, ఇదే తరహా దోపిడీ జిల్లావ్యాప్తంగా జరిగినట్లు స్పష్టమవుతుందన్నారు. ప్రధానంగా బాలిగాం గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీ మారుతి మోడరన్ రైస్ మిల్ యజమాని గున్న బాబురావు రైతుల నుంచి అడ్డగోలుగా ధాన్యాన్ని అదనపు పేరిట దోచుకుంటున్న తీరుపై తక్షణం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని సారీ రా నరసింహ యాదవ్ హెచ్చరించారు.





## కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసిన షాపూర్‌నగర్ మార్కెట్ వ్యాపారులు

కుత్బుల్లాపూర్, నవతరం: షాపూర్‌నగర్ మార్కెట్‌లో కూరగాయలు, పండ్ల వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈరోజు కాంగ్రెస్ నాయకులు కూన రఘు గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా షాపూర్‌నగర్ మార్కెట్ పరిసరాల్లో పాదచారులు రోడ్లు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాపారులు తెలిపారు. ముఖ్యంగా మార్కెట్ వద్ద జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలని, అలాగే వ్యాపారులకు అనవసర ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసుల చర్యల్లో సానుకూల మార్పులు తీసుకురావాలని వినతిపత్రం ద్వారా కోరారు. వ్యాపారుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని కూన శ్రీశైలం గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ వ్యాపారులు కల్లు రామ్, పన్నా లాల్, బలరాం, షఫీ, చాంద్, బిల్లా రవి, భాస్కర్, రాకేష్ భాటి, బల్ దేవ్, శ్రీనివాస్, మోజీ రామ్ భాటి తదితరులు పాల్గొన్నారు.





## ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా క్రిస్మస్ సంబరాలు

గాజులరామారం, నవతరం: కుత్బుల్లాపూర్ మండలం, గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ దేవి నగర్ లో గల ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ నందు క్రిస్మస్ వేడుకలు అంబరాన్ని అంటినట్లు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సొంట్టిరెడ్డి పున్నా రెడ్డి విచ్చేయగా, ప్రత్యేక అతిథిగా పాస్టర్ వరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్ వరప్రసాద్ చిన్నారులకు క్రిస్మస్ పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరించి, ప్రేమ, శాంతి, సేవాభావం వంటి విలువలను తెలియజేశారు. అనంతరం పిల్లలతో కలిసి ప్రార్థన నిర్వహించారు. తదుపరి కేక్ కట్టింగ్ కార్యక్రమం నిర్వహించగా, చిన్నారులు డాన్స్, సింగింగ్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని క్రిస్మస్ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.

## 68వ జాతీయ పిస్టల్ షూటింగ్‌లో సత్తా చాటిన తెలంగాణ క్రీడాకారుడు

### జాతీయ ప్రఖ్యాత షూటర్‌గా బురిగారి కిషోర్ అద్భుత ప్రదర్శన



హైదరాబాద్, నవతరం: 68వ జాతీయ పిస్టల్ షూటింగ్ పోటీలలో తెలంగాణ క్రీడాకారుడు బురిగారి కిషోర్ అద్భుత ప్రదర్శనతో జాతీయ ప్రఖ్యాత షూటర్ గా సత్తా చాటాడు. యువత వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత జాతీయ రైఫిల్ సంఘం 2025 సంవత్సరానికి గాను న్యూ ఢిల్లీలోని ప్రతిష్టాత్మక డాక్టర్ కర్ణీ సింగ్ షూటింగ్ రేంజ్‌లో 68వ జాతీయ పిస్తల్ షూటింగ్ పోటీలను డిసెంబర్ 11 నుండి 4 జనవరి 2026 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మద్దతు అందించింది. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా టాప్ షూటర్లు పాల్గొని, అసాధారణ ప్రతిభ ఉన్నత క్రీడాంగణ నీతిని ప్రదర్శిస్తున్నారు. అందులో భాగంగా డిసెంబర్ 23న మంగళవారం ఉదయం 9 గంటలకు జరిగిన 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్ పోటీల్లో బురిగారి కిషోర్ అద్భుత ప్రదర్శన కనబర్చి 600 కు 545 స్కోర్ సాధించారు. తెలంగాణా హెడ్ కోచ్ వరనాసి సందీప్ కుమార్ శిక్షణలో అద్భుతమైన నైపుణ్యం, క్రమశిక్షణ అంకితభావాన్ని ప్రదర్శించిన కిషోర్ జాతీయ ప్రఖ్యాత షూటర్ గా ఎదిగారు. అధికారులు, తోటి అథ్లెట్లు షూటింగ్ క్రీడా ప్రియుల నుండి గుర్తింపు పొందిన కిషోర్ షూటింగ్ కెరీర్‌లో ముఖ్య మైలురాయిని అధిగమించారు. కిషోర్ ప్రదర్శన భారతీయ షూటింగ్ క్రీడాకారులకు గర్వకారణమని తన విజయం భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాలకు సూచికగా నిలిచిందని తెలంగాణ హెడ్ కోచ్ వరనాసి సందీప్ కుమార్ అభినందనలు తెలిపారు.

# ఇప్పటివరకు సిలికాన్ వ్యాలీ





ఇప్పుడు క్వాంటం వ్యాలీలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్, నవతరం: క్యుబిట్, వైసర్ సంస్థలతో కలిసి ప్రభుత్వం వేలాది టెక్ విద్యార్థులతో ఆన్ లైన్లో నిర్వహించిన 'క్వాంటమ్ టాక్' కార్యక్రమంలో పాల్గొని నా విజన్ గురించి ఆయన విజన్ గురించి చెప్పారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. పాతిక, ముప్పై ఏళ్ళ క్రితం ఐటీ గురించిన చెప్పిన ఆయన ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీ గురించి మాట్లాడుతున్నానని... నిన్నటి వరకు ఎవరికి ఏ వినూత్నమైన ఆలోచన వచ్చినా సిలికాన్ వ్యాలీకి వెళ్లి దాన్ని సాకారం చేసుకునేవారు. కానీ ఇకపై ప్రపంచంలోని వారంతా అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీకి రానున్నారని చెప్పానన్నారు.

# రెండు కార్డుల విధానానికి స్వస్తి పలకాలి

**అక్రెడిటేషన్స్ కొత్త జీ.ఓను సవరించాలని టీయూడబ్ల్యూజే డిమాండ్**

**27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల ముందు ఆందోళనకు పిలుపు**




హైదరాబాద్, నవతరం: రెండు సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్స్ జారీ చేయడం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీ.ఓ. నెంబర్ 252 పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనియన్ కోశాధికారి పి. యోగనంద్, టెంజు ప్రధాన కార్యదర్శి ఎ. రమణ కుమార్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్ లతో కలిసి ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల కనీస హక్కు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, జర్నలిస్టుల మధ్య విభేదాలు తెచ్చే విధంగా కొత్త జీ.ఓ ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో పనిచేసిన జర్నలిస్టులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో 2014 మార్చి నెలలో జరిగిన జర్నలిస్టు జాతరకు వచ్చిన అప్పటి కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ అందరి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చుకుందామని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆయన సూచన మేరకు పూర్వ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 23 వేల మంది జర్నలిస్టులకు అక్రెడిటే షన్స్ కార్డ్స్ జారీ చేయడం జరిగిందని వారు అన్నారు. ప్రధానంగా డెస్క్ జర్నలిస్టులను కూడా గుర్తించి ఒకే గొడుగు కిందికి తెచ్చి అందరికీ కార్డులివ్వగా 40 ఏళ్ల నుంచి జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతూ రెండు రాష్ట్రాల్లో ఉండే ఒక సంఘం అప్పట్లో దీనిని వ్యతిరేకించిందని, నేడు వాళ్ళ యూనియన్ కు చెందిన జాతీయ నాయకుడే మీడియా అకాడమీ చైర్మన్ ఉండటంతో ఇప్పుడు డెస్క్ జర్నలిస్టులను వేరు చేసి వాళ్ళ పంతాన్ని నెగ్గించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని డెస్క్ జర్నలిస్టులు నిశితంగా గమనించాలని కోరారు. మీడియా అక్రిడిటేషన్ కార్డు, మీడియా కార్డు పేరిట రెండు కార్డులు తెచ్చి గందరగోళం సృష్టించారని, ఏ కార్డు వల్ల ఏ ప్రయోజనం జరుగుతుందో జీవోలో విశదీకరించలేదని, జర్నలిస్టులనే వాళ్లకు అందరికీ ఒకే రకమైన ప్రయోజనాలు ఉండాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు పూర్తవుతున్న నేపథ్యంలో కొత్తగా ఇవ్వబోయే కార్డుల కోసం కొత్త నిబంధనలు పెట్టి కార్డులలో 10 వేలకు పైగా కోత పెట్టె విధంగా ప్రస్తుత నిబంధనలు తెచ్చారన్నారు. ఈ నిబంధనలతో జర్నలిస్టులు తమ హక్కుగా పొందే అక్రెడిటేషన్స్ కార్డులను కోల్పోవడం అనివార్యం అన్నారు. రిపోర్టర్స్, డెస్క్ జర్నలిస్టులకు మధ్య విబేధాలు సృష్టించే విధంగా "మీడియా కార్డును" తేవాలని యోచించడం శోచనీయం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో తీసుకు వచ్చిన జి.ఓ 239 ప్రకారం అప్పటి చైర్మన్ అల్లం నారాయణ కేబుల్ ఛానెల్ లకు రాష్ట్ర స్థాయిలో 12, జిల్లా స్థాయిలో నాలుగు అక్రిడిటేషన్స్ ఇవ్వగా ప్రస్తుత చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కేబుల్ ఛానల్ పై కక్ష కట్టినట్లు రాష్ట్ర స్థాయిలో ఒక్క కార్డు కూడా ఇవ్వకుండా జీవో తేవడం వెనుక మర్మం ఏమిటో అర్థం కావటం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రికి ప్రస్తుతం మీడియా అకాడమీ తో పాటు, ఆయన కొనసాగుతున్న సంఘం వారు తప్పుడు సమాచారం ఇవ్వడం వల్లే ఇలాంటి జీవో వచ్చి ఉంటుందని తాము భావిస్తున్నామని, రాష్ట్రంలోని మెజార్టీ జర్నలిస్టులు వ్యతిరేకించే ఈ జీవో ను వెంటనే పున' పరిశీలించి అర్హులైన అందరి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ లు అందేలా నూతన జీఓను సవరించాలని డిమాండ్ చేశారు. తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, కోశాధికారి యోగానంద్ లు మాట్లాడుతూ ఇండిపెండెంట్ జర్నలిస్టుల కనీస అనుభవం 10 సంవత్సరాలనుండి 15 సంవత్సరాల పెంచడం అన్యాయం అన్నారు. 23 వేల అక్రిడేషన్ కార్డులు ఇస్తే ఇక్కడ అర్హులకు కార్డులు ఇవ్వడం లేదని ఢిల్లీకి పోయి ధర్నా చేసిన ఆ ఆంధ్రా సంఘం నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. పెద్ద పేపర్లకు, శాటిలైట్ ఛానల్ లకు సైతం భారీ స్థాయిలో కోత విధించారని, అనుభవంలోకి వస్తే కానీ అందరికీ అర్థం కాని విధంగా ఈ జీవో ను తీసుకువచ్చారని అన్నారు. ఐ జేయు నాయకులు భాస్కర్ మాట్లాడుతూ మీడియా అక్రిడిటేషన్ కమిటీలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులను ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. ఢిల్లీలో ఒకపక్క పిసిఐ కమిటీయే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, అసలు ప్రస్తుతం సభ్యులే లేరని అలాంటప్పుడు ఎవరిని ఈ కమిటీలో సభ్యులుగా చేరుస్తారో అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ నవీన్ కుమార్ యారా, జిల్లా అధ్యక్షులు రాకేష్ రెడ్డి, జిల్లా కోశాధికారి బాపూరావు తదితరులు పాల్గొన్నారు. 27 న కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళనలు... ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీ.ఓ 252 ను సవరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27 అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయాల ముందు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. అప్పటిలోపు ప్రభుత్వం జీఓ ను సవరించాలని తాము కోరుకుంటున్నామని, ఒకవేళ తాత్సారం చేస్తే రాజ్యాంగం కల్పించిన హక్కుగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ ప్రకటించారు.

# ప్రభుత్వ భూములే వీరి టార్గెట్








21వ తారీఖు డిసెంబర్ 2025 నాటి పూర్తి నిర్మాణం ఫోటో...

దుండిగల్, నవతరం: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా కబ్జాలకు గురైన చెరువులు, ప్రభుత్వ భూములపై దండయాత్ర కొనసాగిస్తుంది. కానీ కొందరు భూ బకాసురులు మాత్రం హైడ్రా ను పట్టించుకోకుండా ప్రభుత్వ స్థలంలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే గదులు నిర్మిస్తూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. ఒక్కో గదిని అమాయక ప్రజలకు లక్షల్లో అమ్ముతూ అందినకాడికి దండుకుంటున్నారు. హైడ్రా నగరంలో వేల కోట్ల ఆస్తులను కాపాడుతున్నా కూడా కొందరు అవేమి పట్టనట్టుగా ప్రభుత్వ భూములను కాజేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే దుండిగల్ గండిమైసమ్మ మండల పరిధి చర్చి గాగిల్లాపూర్ సర్వే నంబర్ 214 ప్రభుత్వ స్థలంలో భూ బకాసురులు ఖాళీ జాగలను 60, 80 గజాలుగా విభజిస్తూ రాత్రికి రాత్రే గదులు నిర్మిస్తున్నారు. గదులను అమాయక ప్రజలకు అమ్ముతూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ గదులపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.సర్వే నెంబర్ 120 లో జిఓ 59 పేరుతో...ఇదే మండల పరిధిలోని దొమ్మర పోచంపల్లి సర్వే నెంబర్ 120 లో దాదాపు 120 గజాలలో ఓ గది రూపుదిద్దుకుంది. గతంలో అక్రమ గదిని రెవెన్యూ అధికారులు కూల్చివేతలు జరిపారు. కానీ ప్రస్తుతం చకాచకా పనులు చేస్తూ నిర్మాణం పూర్తి చేశారు. అంతకుముందు రెవెన్యూ అధికారులు ఆ గదిని కూల్చారు. ఇప్పుడేమో జిఓ 59 ఉందంటూ వత్తాసు పలకడంపై ఒప్పందాలు కుదిరాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వదిలి గదులను కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.చర్చి గాగిల్లాపూర్ సర్వే నంబర్ 214 లో...గండిమైసమ్మ దుండిగల్ మండల పరిధిలోని చర్చి గాగిల్లాపూర్ లోని భూకబ్జాలకు ఒక చరిత్ర ఉంది. ఇక్కడి ప్రభుత్వ భూముల్లో పాగా వేసిన కొందరు కబ్జాదారులు కొందరు గంజాయి బ్యాచ్ లను పెంచి పోషిస్తారు. అదీ కాకుండా రెవెన్యూ అధికారుల విధులకు అడ్డుపడుతూ... కూల్చివేతలు జరగకుండా చూసుకుంటారు. కేసులు కాకుండా పైరవీలు చేసుకుంటారు. అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు... అదీ కుదరకపోతే, ఇక్కడ ఇల్లు కట్టుకున్నది చాలా పేదవారు... వారికి మేమే ఒక్కొక్కరం పది పది వెయిల రూపాయలు సహాయం చేసి నిర్మించి ఇస్తున్నాం అంటూ మొసలి కన్నీళ్లు కారుస్తారు. లేదంటే దాడులకు దిగుతారు. ఇదంతా ఇక్కడి కొందరు నకిలీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో జరుగుతుంది. అందుకు ప్రత్యక్ష నిదర్శనం బేకరీ ముందు వెలిసిన డబ్బా నిర్మాణం. ఇక్కడి కబ్జాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం నామమాత్రంగానే ఉంటుంది. అందుకు మరో నిదర్శనం ఇక్కడ వెలిసిన ఓ పెర్మనెంట్ రూమ్ నిర్మాణం.



**తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, డిసెంబర్ 23, 2025న జోగుళాంబ గద్వాల్‌లోని జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్‌లో సీనియర్ జిల్లా అధికారులు, ప్రముఖ రచయితలు, కళాకారులు, ఇతర ప్రముఖ వ్యక్తులతో సంభాషించారు. సందర్శన సందర్భంగా, గవర్నర్ స్థానిక కార్యక్రమాలు, సాంస్కృతిక వారసత్వం మరియు అభివృద్ధి కార్యకలాపాలను ప్రదర్శించే ప్రదర్శన స్టాళ్లను సమీక్షించారు. సమ్మిళిత వృద్ధి, కళ, సంస్కృతిని ప్రోత్సహించడంలో జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని ప్రశంసించారు. - (నవతరం, హైదరాబాద్)**



**మాజీ ప్రధానమంత్రి, 'భారతరత్న' స్వర్గీయ పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తమ నివాసంలో ఆ మహనీయుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. - (నవతరం, హైదరాబాద్)**

## ఎన్ఐఏ నోటీసులు సరికాదు



హైదరాబాద్, నవతరం: విధి నిర్వహణలో భాగంగా హిడ్మా మరణానంతరం న్యూస్ కవరేజ్ కి వెళ్ళిన జర్నలిస్టు రఘు కు ఎన్ఐఏ నోటీసులు జారీ చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ లు అన్నారు. న్యూస్ ఛానల్ రిపోర్టర్ల కు జాతీయ పరిశోధన సంస్థ నోటీసులిచ్చి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. ఈ చర్య ను ఖండించిన వారిలో తెంజు రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, యూనియన్ కోశాధికారి యోగానంద్, ఐజెయు నాయకులు అవ్వారి భాస్కర్, హైదరాబాద్ ఇంచార్జ్ నవీన్ కుమార్ లు ఉన్నారు.



## హ్యాపీ బర్త్ డే మధు

కుత్బుల్లాపూర్, నవతరం: ఉషోదయ కాలనీ వాస్తవ్యులు మధు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి గురుస్వామి తనయుడు, యువ నాయకులు... రావుల పృధ్వి. ఈ కార్యక్రమంలో రావుల రిషింద్ర సాగర్, గడ్డమీద భరత్ కుమార్, రాచకొండ కుమార్, శివ, రామారావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నారైలకు సులభంగా శ్రీవారి దర్శనం

ఎన్నారైలకు సుపథం మార్గంలో ప్రత్యేక దర్శన సౌకర్యంముందస్తు బుకింగ్ అవసరం లేదు.. ఒక్కొక్కరికి రూ.300 టికెట్భారత్‌కు వచ్చిన 30 రోజుల్లోపు మాత్రమే అర్హతదర్శనానికి ఒరిజినల్ పాస్‌పోర్టు, ఇమ్మిగ్రేషన్ స్టాంప్ తప్పనిసరితిరుమల శ్రీవారిని దర్శించుకోవడం అనేది కోట్లాది భక్తుల కల. దేశంలోనే కాకుండా విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారు, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా భారతదేశానికి వచ్చిన ప్రతిసారీ తిరుమల యాత్రను తమ ప్రయాణంలో భాగంగా చేసుకుంటారు. ఈ నేపథ్యంలో విదేశాల నుంచి వచ్చే భక్తుల సౌలభ్యం కోసం టీటీడీ ఎన్నారైలకు ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పిస్తోంది.ఎన్నారై భక్తులు తిరుమలలోని సుపథం మార్గం ద్వారా నేరుగా శ్రీవారి దర్శనానికి వెళ్లవచ్చు. ఈ దర్శనానికి ముందస్తుగా ఆన్‌లైన్ బుకింగ్ అవసరం లేదు. అవసరమైన డాక్యుమెంట్లను చూపించి ఒక్కొక్కరికి రూ.300 చెల్లించి టికెట్ పొందవచ్చు. సాధారణంగా ఈ ప్రత్యేక దర్శనం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. భక్తుల రద్దీని బట్టి సమయాల్లో మార్పులు ఉండొచ్చు.ఈ దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించాలి. అలాగే, భారత్‌కు వచ్చిన తేదీ నుంచి 30 రోజుల లోపు మాత్రమే ఈ ప్రత్యేక ఎన్నారై దర్శనానికి అర్హులు. దర్శన సమయంలో ఒరిజినల్ పాస్‌పోర్టు తప్పనిసరి. పాస్‌పోర్టులోని ఇమ్మిగ్రేషన్ అరైవల్ స్టాంప్ ఆధారంగా అధికారులు ధ్రువీకరిస్తారు. ఓవర్‌సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ాజ×) లేదా పీఐఓ కార్డు ఉన్నవారు వాటిని కూడా చూపించాలి.ఎన్నారై భక్తులతో పాటు వచ్చిన స్థానిక కుటుంబ సభ్యులకు సుపథం మార్గం ద్వారా దర్శనం అనుమతి ఉండదు. వారు సాధారణ భక్తుల్లాగానే ఆన్‌లైన్‌లో రూ.300 ప్రత్యేక దర్శన టికెట్ బుక్ చేసుకోవాలి. దర్శనం మాత్రమే కాకుండా, తిరుమలలో వసతి, ఆర్జిత సేవల కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ తప్పనిసరి.తిరుమలలో ఎప్పుడూ భారీ రద్దీ ఉండటంతో విదేశాల నుంచి వచ్చే భక్తులు కనీసం 60 రోజుల ముందుగానే వసతి బుక్ చేసుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవలకు లక్కీడిప్ విధానం అమలులో ఉంది. ఈ సేవల కోసం పాస్‌పోర్టు వివరాలు ఇవ్వాలి. దర్శనం లేదా వసతి సమయంలో బుకింగ్‌లో ఉపయోగించిన అసలు పాస్‌పోర్టును చూపించాల్సి ఉంటుంది.

Owned and Published by Sirigiri Varadaraju, Printed at: Shesha Sai Enterprises, Plot No. 98/1, CIE, Phase 2, Gandhinagar, Hyderabad - 37, Telangana State, India, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com